క్లుప్తంగా

నేడు తైబజార్ వేలం

దహెగాం: మండల కేంద్రంలో ప్రతీ మంగళ వారం నిర్వహించే తైబజార్ వేలం శనివారం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనాలన్నారు. పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనడానికి అనర్హులన్నారు. పాల్గొనే వారు ధరావత్తు రూ.25 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జైనూర్ ప్రత్యేకాధికారిగా గుణవంత్‌రావు

జైనూర్: జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. మండల కేంద్రంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న జాదవ్ గుణవంత్‌రావును మండల ప్రత్యేకాధికారిగా నియమించారు.

వాటర్ ప్లాంట్‌లు మూసివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జైనూర్: ఏజెన్సీ ప్రాంతంలో కలుషిత నీటిని అందిస్తున్న వాటర్ ప్లాంట్‌లను తక్షణమే సీజ్ చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ బీర్షావ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఒక వాటర్ ప్లాంట్‌కు వచ్చే నీటి బావిలో చెప్పులు, ఇతర వ్యర్థ పదార్థాలు పడి ఉన్నాయని ఆరోపించారు. సంబంధిత వాటర్ ప్లాంట్‌లపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయా సంఘాల నాయకులు ఆత్రం భీంరావు, కుమ్ర భగవంత్‌రావు, మడావి భీంరావు, కేంద్రే సుభోద్‌కాంత్, రాథోడ్ సందీప్, రాథోడ్ ధర్మేందర్ తదితరులు ఉన్నారు.

సన్మానం

జైనూర్: మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో జన్మించి రాష్ట్రస్థాయిలో ఉద్యమకారుడిగా పేరుగాంచిన నాయకుడు కనక యాదవరావు అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయా సంఘాల నాయకులు ఆత్రం భీంరావు, కుమ్ర భగవంత్ రావు, మడావి భీంరావు, మెస్రం రాహుల్, కేంద్రే సుబోధ్ కాంత్, కేంద్రే శివ్‌రామ్, గుట్టే ప్రవీణ్, రాథోడ్ ధర్మేందర్, రాథోడ్ సందీప్, ఉయిక రమాకాంత్ తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో గల ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏవో రాజులనాయుడు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఎరువుల కొనుగోలు, విక్రయాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. గోదాముల్లో నిల్వ ఉంచిన ఎరువుల వివరాలను బోర్డుపైన ఉంచాలని సూచించారు. రైతులకు జరిపే విక్రయాలకు రశీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో కాంట్రాక్టర్లు, కాంట్రాక్టు ఉద్యోగులతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అందించే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి జీఎం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇటీవలే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో ఒప్పందం చేసుకుందని, అందులో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.30లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించటంతోపాటు జీరో బ్యాలెన్స్‌తో కూడిన అకౌంట్ అందిస్తుందని తెలిపారు. త్వరలో బ్యాంకు అధికారులతో అకౌంట్ ఓపెనింగ్ మేళా నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, ఫైనాన్స్ డీజీఎం రామారావు, పర్సనల్ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్ మేళా

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు ఇన్సూరెన్స్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టల్ శాఖ మంచిర్యాల మేనేజర్ సాగర్ మాట్లాడుతూ ప్రతీ ఖాతాదారుడు పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీపీఎంలు రాధాకృష్ణ, అంజన్న, రవి, మాజీద్, తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులతో వెళ్తున్న విద్యార్థులు

బ్యాగు భారం

- పిల్లలపై పెరుగుతున్న పుస్తకాల మోత
- ప్రైవేట్‌లో మరింత బరువు
- తిప్పలు పడుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: బడికి వెళ్లే చిన్నారులు బ్యాగు బరువుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా తమ సొంత సిలబస్‌తో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ సంఖ్య పెంచుతున్నాయి. దీంతో బ్యాగుల బరువు మోయలేక విద్యార్థులు వంగిపోతున్నారు. పుస్తకాలకు తోడు టిఫిన్‌బాక్స్, వాటర్ బాటిళ్లు, బూట్లు తదితర వస్తువులు మరింత భారంగా మారాయి. కొంత మంది పిల్లల తల్లిదండ్రులు పిల్లల బాధ చూడలేక తమ పిల్లలను బ్యాగులు మోసుకెళ్లి పాఠశాలలో దిగబెడుతున్నారు. పుస్తకాల బరువుపై ప్రభుత్వం ఐదేళ్ల క్రితమే మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

పనికి రాని మార్గదర్శకాలు..

చిన్నారులకు కిలోల కొద్దీ బ్యాగుల మోతను తగ్గించేలా రాష్ట్ర విద్యాశాఖ 2017లో మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం 1, 2 తరగతులకు 1.5 కిలోలు, 3 నుంచి 5వ తరగతులకు 3 కిలోలు, 6, 7వ తరగతులకు 4కిలోలు, 8, 9, 10వ తరగతులకు 5 కిలోలు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కానీ వీటికి విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సొంత సిలబస్ అంటు పుస్తకాలు, నోట్‌బుక్స్ బరువులను మరింత పెంచి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారు. విద్యాశాఖ అధికారులు కమీషన్లు తీసుకొని చూసీచూడనట్లు ఉంటున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాల లేకుండా ఇరుకు గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 740 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 150 ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 45 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్‌బుక్స్‌తో పాటు ఒక రఫ్ బుక్ ఉండేది. కానీ ఇప్పుడు సబ్జెక్టుకు ఇక రఫ్‌బుక్‌తో పాటు గైడ్లు, ప్రాజెక్టు వర్క్, డ్రాయింగ్, స్క్రాప్ బుక్స్, రికార్డులు, డైరీలు ఇలా స్కూల్ బ్యాగులో కిలోల కొద్దీ పుస్తకాలు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. 7వ తరగతి వరకు 6 నుంచి 12 కిలోలు, 8, 9, 10వ తరగతి విద్యార్థులు 12 నుంచి 18 కిలోల బ్యాగులను ప్రతీరోజు వీపు మీద మోస్తున్నారు. కొన్ని పాఠశాలల బస్సులు గేట్ వరకు మాత్రమే పోతుండటంతో అక్కడి నుంచి పాఠశాల వరకు దానితో పాటు ఒకటి, రెండు, మూడు అంతస్తుల మేడలు ఎక్కి క్లాస్ రూం వరకు వెళ్లడంతో చాలా మంది పిల్లల వెన్ను నొప్పి, జాయింట్ పెయిన్స్ బారినపడుతున్నారు.

బ్యాగు బరువుగా ఉంటుంది



పుస్తకాలు, నోట్ పుస్తకాలు అన్ని కలిపితే బ్యాగు చాలా బరువుగా ఉంటుంది. మా టీచర్లు రోజువారీగా హోం వర్క్ ఇస్తారు. అన్ని బుక్స్, నోట్‌బుక్స్ రోజూ తీసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

– వర్షిత్, 9వ తరగతి

బడిలో ప్రత్యేక కౌంటర్లు ఉండాలి



రోజూ అన్ని పుస్తకాలు పాఠశాలకు తీసుకెళ్లి మళ్లీ ఇంటికి తెచ్చుకుంటున్నాం. పాఠశాలలోనే కొన్ని పుస్తకాలు, నోట్ బుక్స్ భద్రపరుచుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. అప్పుడు బ్యాగు బరువు తగ్గుతుంది.

– ప్రజిత్, 8వ తరగతి

విద్యార్థులు ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రైవేట్ పాఠశాలల్లో అవసరం కంటే ఎక్కువ నోట్స్‌బుక్స్ ఇవ్వకూడదు. ప్రాజెక్టు బుక్స్, టెక్స్ట్ బుక్స్ పాఠశాలలోనే ఉంచుకునేలా స్కూల్‌లో ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు.

– మనుకుమార్, ఎంఈవో

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన



కలెక్టర్ కాళ్లు మొక్కేందుకు ప్రయత్నిస్తున్న పెందుర్ ధర్మూ

తిర్యాణి: మండల కేంద్రం నుంచి శ్రీ –ఇన్క్లెయిన్ వరకు గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘం నాయకుడు పెందుర్ ధర్మూ శుక్రవారం నిరసన వ్యక్తం చేశాడు. మండల కేంద్రంలో నీతి అయోగ్ సమీక్ష సమావేశానికి హాజరైన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలు ఎంపీడీవో కార్యాలయం లోపలకు వెళ్లేటప్పుడు అడ్డంగా పడుకొని రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ కాళ్లు మొక్కేందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. రోడ్డు సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించాడు.

‘ఉపాధి’లో అవకతవకలు సహించం



జైనూర్: ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

జైనూర్: ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగితే సహించేది లేదని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొత్తంగా రూ.3.85 కోట్ల పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. డీఆర్పీలు వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన నివేదికలు చదివి వినిపించారు. మస్టర్ల నిర్వహణ, రికార్డుల్లో వివరాలు నమోదు చేయకపోవడం, చెల్లింపుల్లో తేడాలు, కొలతల్లోని వ్యత్యాసాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కూలీలకు పనుల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని రూ.56వేలు జరిమానా విధించడంతో పాటు రూ.86 వేలు రికవరీ చేసి, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో సురేందర్ పేర్కొన్నారు. డీపీవో కృష్ణమూర్తి, అంబుడ్స్‌పర్సన్ సాయిశ్రీ, ఎస్సార్పీ రాఘవులు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో నగేష్ తదితరులు ఉన్నారు.

అటవీ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి గ్రామశివారులో అటవీ భూములను ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ రేంజ్ అధికారి సుధాకర్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, విద్యుత్ శాఖ కార్యాలయల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీకి చెందిన పలువురు నాయకులు అటవీభూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఎల్కపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా బ్రిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేసి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నాడన్నారు. అధికారులు విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు తిరుపతి, శ్రీనివాస్, సాజీద్, చౌదరి బండన్న, సంజీవ్, సుధాకర్, స దాశివ్, ఖైరాత్, మోయిన్, సకరాం, లచ్చన్న పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలు సీఎస్‌సీల ద్వారా ఏర్పాటు చేయాలి



వీఎల్ఈ పవన్‌కుమార్

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి మీ సేవ కేంద్రాలను సీఎస్‌సీల ద్వారా ఏర్పాటు చేయాలని జిల్లా వీఎల్ఈలు కోరారు. శుక్రవారం మండల కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్ఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా గ్రామాల్లో సీఎస్‌సీల ద్వారా కేంద్ర ప్రభుత్వ సర్వీసులను అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులను సీఎస్‌సీలకు అప్పగించి వీఎల్ఈలను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర సర్వీసులను సీఎస్‌సీలకు అప్పగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

బీసీ యువజన సంఘానికి ప్రణయ్ రాజీనామా

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ ఆధ్వర్యంలో విద్యారంగ, నిరుద్యోగ సమస్యలపై అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వ్యక్తిగత కారణాలతో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలు నాటుతున్న నాయకులు

దహెగాం: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా మండల బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, సహకార సంఘం చైర్మన్ తిరుపతిగౌడ్, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, నాయకులు పడాల సురేశ్, కోండ్ర రాజాగౌడ్, ప్రదీప్, చందు, దెబ్బటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్ రైల్వేగేటు మూసివేత

రెబ్బెన: మండల కేంద్రంలోని గంగాపూర్ రైల్వే గేటును శనివారం నుంచి మూడు రోజులపాటు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా మూడు రోజులపాటు గేటు మూసివేస్తామని తెలిపారు. ట్రాక్ అవతలి వైపు ఉన్న గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

పీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించాలి



మాట్లాడుతున్న వినేశ్

కెరమెరి: గడిచిన కొంత కాలంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వైద్య సిబ్బందిని నియమించాలని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు కంబాల వినేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వైద్యానికి పెద్దపీట వేశారని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం కనీస సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని విమర్శించారు. నాయకులు పరమేశ్వర్, రాహుల్, సంజు, రాజు, రవి తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పంగిడిమాదరలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

తిర్యాణి: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని పంగిడి మాదర గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకును అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా మంజూరవుతున్న రుణాలను సద్విని యోగం చేసుకొని ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. నీతి అయోగ్ పథకం ద్వారా ఆదివాసీ గూడెలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎంపీ గోడం నగేశ్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, పక్కన ఎంపీ నగేశ్

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. శుక్రవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు జన్మదినం సందర్భంగా పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైల్వే, రహదారుల సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ పోడు రైతుల సమస్య చాలా వరకు పరిష్కరించామన్నారు. పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి కొత్త భవనంతోపాటు ఎల్లాగౌడ్ తోటలో వంద పడకల ఏరియా ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలోని రహదారుల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలేదని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని లేవనెత్తుతామని తెలిపారు. అంతకుముందు పాల్వాయి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు గోలెం వెంకటేశం, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, వీరభద్రచారి, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

దహెగాం: సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు జన్మదినం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ తిరుపతిగౌడ్, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, నాయకులు పడాల సురేశ్, కోండ్ర రాజాగౌడ్, ప్రదీప్, చందు, దెబ్బటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఏటిగూడ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జలపతి, శంకర్, రాములు, అశోక్, మహేశ్, తరుపతి, రవి, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఇంటింటికి వెళ్లి..

- ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరిన ఉపాధ్యాయులు



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌రూరల్: భట్‌పల్లి గ్రామపంచాయతీ లక్ష్మినగర్‌కాలనీలో గల దుర్గయ్యవాడ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ ఖమర్, ఉపాధ్యాయుడు జర్పుల విజయ్‌లు శుక్రవారం విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు వారిని ఒప్పించారు. ఖమర్ మాట్లాడుతూ చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు సుముఖత చూపారన్నారు.

డీఈ రవికాంత్ వేధింపులు సరికాదు



నిరసన తెలుపుతున్న అటెండర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయం డీఈ రవికాంత్ వేధింపులకు గురి చేస్తున్నారని శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈ కార్యాలయం గేటుకు తాళం వేసి అటెండర్లు నిరసన తెలిపారు. అటెండర్ దేవిదాస్ మాట్లాడుతూ తన భార్య లహరికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉండడంతో వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు డీఈని ఫోన్‌లో అనుమతి కోరగా ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగిందన్నారు. ఈనెల 4వ తేదీన తనపై డీఈ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు తనను చిత్రహింసలకు గురి చేశారన్నారు. తాను ఏదైనా తప్పు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి కానీ పోలీసులు ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అటెండర్లు పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు..

ఇరిగేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తన భర్త దేవిదాస్‌ను స్థానిక పోలీసులు ఈనెల 4వ తేదీన పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా చిత్రహింసలకు గురి చేశారని దేవిదాస్ భార్య లహరి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.

డీవైఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన: రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిలుపు నిచ్చిన తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమీషన్ ముట్టడిని దృష్టిలో పెట్టుకుని పోలీసులు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీశ్‌లను శుక్రవారం ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతోందన్నారు. గ్రూప్ పోస్టుల సంఖ్య పెంచాలని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని, ఉద్యోగాల నియామకాలు పారదర్శకతతో చేపట్టాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని యువతను మాదకద్రవ్యాల నుంచి కాపాడాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కొంతమంది వ్యాపారులు, అక్రమార్కులు గంజాయి, డ్రగ్స్ గుట్కా, మట్కా పేకాట, ఆన్‌లైన్ గేమ్స్‌తో యువతను చెడుదారుల్లో నడిపిస్తున్నారని తెలిపారు. టీకానంద్, గొడిసెల కార్తీక్, కొరంగ మాల, నికిల్, తిరుపతి పాల్గొన్నారు.